సీఎంను కలిసి కాంగ్రెస్ నేత

సీఎం రేవంత్‌రెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ బుధవారం అంబేద్కర్ సచివాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన సీఎంకు విన్నవించారు.

- మియాపూర్, జనవరి 31

బాలానగర్ సీఐగా పీ. నవీన్‌కుమార్



బాలానగర్, జనవరి 31 : బాలానగర్ సీఐగా పీ. నవీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన కె.భాస్కర్ సైబరాబాద్ సీటీసీకి బదిలీపై వెల్లగా ఎస్‌బీ ఎలక్షన్ సెల్‌లో పని చేస్తున్న నవీన్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ పీ. నవీన్‌కుమార్ మాట్లాడుతూ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఇందిరానగర్ బస్తీ అభివృద్ధికి కృషి

బాలానగర్, జనవరి 31 : ఇందిరానగర్ బస్తీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. బుధవారం ఇందిరానగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు పర్యటించి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గొట్టి ముక్కల వెంకటేశ్వర్‌రావు, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, పుష్పారెడ్డి, ప్రసన్నకుమార్, మోహన్‌రెడ్డి, లక్ష్మన్, మధుగౌడ్, ఆకుల నరేందర్, మేకల రమేశ్ పాల్గొన్నారు.

ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు

- వర్షంనీటి కాలువను పునరుద్ధరించాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రంగధాముని చెరువు వరదనీటి కాలువను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : రానున్న వర్షాకాలంలో వర్షంనీటి ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రంగధాముని చెరువు నుంచి కూకట్‌పల్లి బస్‌డిపో వరకు వర్షంనీటి కాలువలను పునరుద్ధరించే పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువు నుంచి కూకట్‌పల్లి బస్‌డిపో వరకు వర్షంనీటి కాలువను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగధాముని చెరువు నుంచి ప్రవహించే వర్షం, డ్రైనేజీ నీరు స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్ పక్కనుంచి కూకట్‌పల్లి బస్‌డిపో వరకు చేరుతుందన్నారు. ఈ మార్గంలో వదర నీటి కాలువ సరిగా లేకపోవడం వల్ల స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి వర్షంనీరు చేరుతుందని.. తద్వారా గత రెండు సంవత్సరాలుగా ఆ సెల్లార్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు నీట మునగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కూకట్‌పల్లి బస్‌డిపో వద్ద జాతీయ రహదారిపై వర్షంనీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు పడాల్సి వచ్చిందన్నారు. భారీ వర్షాలు కురిసినా.. వరదనీరు సజావుగా దిగువకు ప్రవహించేలా నాలా పునరుద్ధరణ పనులను చేపట్టాలన్నారు. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధంచేసి పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్‌లో ముంపు సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా పనులు చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల తాసీల్దార్, స్వామి, టౌన్‌ప్లానింగ్ సీపీ ఉమాదేవి, ఏసీపీ మల్లేశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, మాజీ కార్పొరేటర్ బాబూరావు, స్థానిక నేతలు ఉన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

దుండిగల్‌లో సీసీ రోడ్డుపనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణరావు, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తదితరులు

దుండిగల్,జనవరి31: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి, ఆదర్శ మున్సిపాలిటీగా దుండిగల్‌ను రూపొందించేందుకు కృషిచేస్తున్నామని దుండిగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, 23వ వార్డు, మల్లంపేట్ రూ.42లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు, రూ.25లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలోస్థానిక కౌన్సిలర్ మాదాసు వెంకటేశ్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

దుండిగల్‌లో..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 2వ వార్డు, దుండిగల్ విలేజీలోని శ్రీసాయి సంకల్పకాలనీలో రూ.12లక్షల నిధుల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణపనులకు దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, జక్కుల కృష్ణాయాదవ్, ఆనంద్‌కుమార్‌తో పాటు గ్రామమాజీ సర్పంచ్ కావలి గణేశ్, కాలనీ ప్రెసిడెంట్ ఎల్లయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

మియాపూర్, జనవరి 31 : సామాజిక సేవలో భాగంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తుండటం అభినందనీయమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని తారకరామానగర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మద్, ఖాజా, పోశెట్టి, రవి, సాగర్, సంపత్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయనగర్‌లో

డివిజన్ పరిధిలోని విజయనగర్ హైటెన్షన్ రోడ్డులో రూ. 80 లక్షల నిధులు గతంలో మంజూరు కాగా తాజాగా ప్రారంభమైన సీసీ నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు. బేతల్ గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు డివిజన్ యువనేత రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా బుధవారం బహుమతులను అందించారు.

మాణిక్యంను సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

పదవీ విరమణ పొందిన మాణిక్యంను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

శేరిలింగంపల్లి, జనవరి 31 : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్‌డిపోలో సుదీర్ఘ కాలంగా విశిష్ట సేవలందించి, పదవీ విరమణ పొందిన టీఐ ఎం మాణిక్యంను బుధవారం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంగా ఆర్టీసీ సంస్థలో సేవలందించిన మాణిక్యం, తనకు సహకరించిన కుటుంబ సభ్యులను సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం కుటుంబంతో కలిసి ఆనందదాయక జీవితాలను గడపాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో డీఎం ఎంఎం రెడ్డి, సీఐ ప్రశాంత్ కుమార్, మాణిక్యం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతోనే సురక్షిత ప్రయాణం

కూకట్‌పల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ట్రాఫిక్ పోలీసులు

జగద్గిరిగుట్ట, జనవరి 31: సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా బుధవారం ఐడీఎల్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విశ్వవిశ్వాని, భాగ్యరథీ కాలేజీల విద్యార్థులు పాల్గొని ప్రమాదాలు జరుగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెల్మెట్, లైసెన్స్‌తోనే బైక్‌లు నడపాలన్నారు. కార్లు, ఆటోల్లో అనుమతించిన మేరకే ప్రయాణికులు ఉండాలి. భారీ వాహనాలు నిర్దేశిత సమయాల్లో పరిమిత లోడుతో ప్రయాణించాలని తెలిపారు. హెల్మెట్ లేని, ఎక్కువ మందితో ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి నిబంధనలు వివరించారు. అనంతరం బ్యానర్లు ప్రదర్శించి 2కేరన్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రమేశ్, ఎస్ఐలు యాదగిరి, సందీప్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో..

కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం ఐడీఎల్ చెరువు ప్రాంగణంలో విశ్వవాహిణి కళాశాల, సంగమిత్ర కళాశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ రూల్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన..

అల్లాపూర్: నేరాల నియంత్రణ చట్టాలు, ఇండియన్ పీనల్ కోడ్‌కు సంబంధించిన సెక్షన్లపై శ్రీసాయి చైతన్య స్కూల్ లో విద్యార్థులకు అల్లాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఎలా విధులు నిర్వర్తిస్తారు, నేరాలు జరిగినప్పుడు వాటిని ఎలా ఛేదిస్తారు, నేరస్తులను పట్టుకునే తీరును విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. నేరాలకు దారితీసే కారణాలు, వాటిని ముందుగా ఎలా అరికట్టాలనేదాని పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీసాయి చైతన్య స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

మూసాపేటలో 2కే రన్‌లో ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఆంజనేయులు

అభివృద్ధిపై బస్సులో ఫొటో ప్రదర్శన

పదేండ్లలో కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కార్ దేశంలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆర్థికాభివృద్ధి కోసం తీసుకువచ్చిన సంస్కరణలు, దేశ భద్రతపై అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ ప్రధాన కూడలి వద్ద బీజేపీ సీనియర్ నాయకుడు సుదర్శన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బస్సులో ఫొటోల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సాయిచంద్ పాల్గొన్నారు.

- అల్లాపూర్, జనవరి 31

గద్దర్‌కు నివాళి



జగద్గిరిగుట్టలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

జగద్గిరిగుట్ట, జనవరి31: జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌లో బుధవారం గద్దర్ జయంతి జరిపి నివాళులర్పించారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచే యాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఐలయ్య, మల్లేశ్, యాదగిరి, పరశురాములు, చంద్రయ్య, గణేశ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

నేతలు గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకోసం ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఉమామహేశ్, స్థానికనేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మహేశ్‌కుమార్‌ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, జనవరి 31: తెలంగాణ మండలి శాసనసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన నూతన ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లను బుధవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముప్పిడి పూర్ణచందర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ..

వీరశైవ లింగాయత్ సమాజం నూతనంగా రూపొందించిన 2024 క్యాలెండర్, డైరీని బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అల్లి భద్రన్న, నర్సింహులు, సుఖశాంత్, శివశేఖర్, మాణిక్యం, దిలీప్, మల్లికార్జున్, బసవరాజు, బాసన్నగౌడ్, నాగశెట్టి తదితరులున్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31

విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

అల్లాపూర్, జనవరి 31: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికుల ప్రజలు కార్పొరేటర్ కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ దృష్టికి కార్పొరేటర్ సమస్యను తీసుకెళ్లడంతో బుధవారం శ్రీవివేకానందనగర్‌లో సిబ్బంది తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కరెంటు తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను అధికారులు గుర్తించి ఎప్పటికప్పుడు తొలగించడం వలన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో బుధవారం కూరగాయల ధరలు క్రింది విధంగా ఉన్నాయి. టమాట 21, వంకాయ 13, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజి 25, ఫ్రెంచ్ బీన్స్ 35, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 31, చిక్కుడు 23, గోరు చిక్కుడు 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలుగడ్డ 21, కీరా 21, దోసకాయ 21, సొరకాయ 11, పొట్లకాయ (1) 13, కందగడ్డ 55, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 20, చింతకాయ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 55, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 23, గుమ్మడికాయ 18, నిమ్మకాయలు(12) 32 నుంచి 36, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠాని 45, పొప్పడికాయ 40, పుట్ట గొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 280, అల్లం 140, వెల్లుల్లి 320, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతు బజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా సత్వర చర్యలు

- కుత్బుల్లాపూర్‌లో కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దూలపల్లిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, జనవరి 31: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కోట్ల వ్యయంతో శాశ్వత పరిష్కారమార్గాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి -44 దూలపల్లి చౌరస్తా నుంచి రాష్ట్ర రహదారి-66 నర్సాపూర్ ప్రధాన దారి బహదూర్‌పల్లి చౌరస్తా వరకు విస్తరిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. హెచ్‌ఎండీఏ అధికారులతో పాటు మున్సిపాలిటీ అధికారులతో నిర్మాణ పనులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారులను విస్తరించుకునేందుకు కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయని, దీనికి తోడు కొంపల్లి నుంచి కండ్లకోయ వరకు, నిజాంపేట్ నుంచి బౌరంపేట్ వరకు, బాలానగర్ నుంచి బహదూర్‌పల్లి వరకు, షాపూర్ చౌరస్తా నుంచి గాజులరామారం, కైసర్‌నగర్ మీదిగా నిజాంపేట్ వరకు రోడ్ల విస్తరణతో పాటు మార్గమధ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వాటిని పూర్తి చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో కుత్బుల్లాపూర్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారమార్గాలను ఏర్పాటు చేసే దిశగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్ డప్పు కిరణ్‌కుమార్, చింతల రవీందర్‌యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొంపల్లిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కృతజ్ఞతయాత్ర..

అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన కృతజ్ఞతయాత్ర బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా హనుమాన్‌టెంపుల్ కాలనీ, సాయినగర్ కాలనీ, అయ్యప్పకాలనీ, గంగస్తాన్‌లో కృతజ్ఞతయాత్ర చేపట్టారు. కాలనీలవాసులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్ డప్పు కిరణ్, చింతల రవీందర్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు చింతల దేవేందర్‌యాదవ్, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో అధికారులతో కలసి పరిశీలనలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనులు

మియాపూర్, జనవరి 31 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో చేపట్టనున్న డివైడర్ నిర్మాణ పనులతో ట్రాఫిక్ మళ్లింపు పనులను ట్రాఫిక్ సీఐ వెంకట్, ఇతర అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానాటికీ పెరుగుతున్న వాహనాల రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యల్లేకుండా డివైడర్ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ట్రాఫిక్ డైవర్షన్‌ను చేపట్టనున్నట్లు, ప్రజలు వాహనదారులు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. చిరు వ్యాపార వాణిజ్య సంస్థలు రహదారులపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, మహదేవ్, పార్టీ నేతలు రాజేందర్, వెంకటరెడ్డి, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, జనవరి 31: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సరిత తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన సూరన్న నర్సింహారెడ్డి, నాగసత్యవేణి(26) దంపతులకు అభిరాం, జ్ఞానేశ్వర్ కుమారులు ఉన్నారు. నర్సింహారెడ్డి ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. చిన్న కొడుకు జ్ఞానేశ్వర్ మొదటి బర్త్ డే సందర్భంగా కొడుకుకు బంగారు చైన్ కావాలని భర్తను కోరడంతో బంగారానికి డబ్బులు లేవని సమాధానం ఇచ్చాడు. కాగా వారం రోజుల కిందటనే కొడుకు బర్త్ డే చేశారు. అయితే అప్పటి నుంచి భార్య మనస్తాపానికి గురైంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగసత్యవేణి ఉరి వేసుకొని మృతి చెందింది. పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో..

అనుమానాస్పద స్థితిలో మరో మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ బాపునగర్ ప్రాంతానికి చెందిన అశ్విని(23) భర్త కొండల్‌రావు దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని పలు కోణాలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతికప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో - గాంధీ బుణాకర్ మేళలో భాగంగా బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. ప్రదర్శనల్లో వేలూరి లక్ష్మి గీత వీణ వాయిద్యం అలరించగా, గౌతమీ రాణి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

- కొండాపూర్, జనవరి 31

PUBLIC NOTICE

General public are hereby noticed/informed that, M/s. S.N. Mining Products represented by Partners, Mr. N.M. Raju and Mrs. N. Sneha and Mr. N. Nitin Varma having its registered office at H.No. 274, Jalvayu Vihar, Kukatpally, Balanagar, Rangareddy, Telangana-500 085, India has decided to dissolve the partnership firm having PAN: ADBFS8725J and GSTIN: 36ADBFS8725J1ZP any person having any claims or objections may inform to the undersigned in writing a week from today failing which we will proceed with the dissolution process as if there are no objections or claims from any one.

Sd/- **M/s. S.N Mining Products, Represented by Partners Mr. N. M. Raju & Mrs. N. Sneha & Mr. N. Nitin Varma,**
H.No. 274, Jalvayu Vihar, Kukatpally, Balanagar, Rangareddy, Telangana-500 085,
Mobile: 9000080669.